

కబ్బన్ పార్కులో సండే సందడి 7

శీతాకాల సమావేశాలకు రూ.21 కోట్లు



సమావేశాలకు సిద్ధమవుతున్న సువర్ణ సౌధ



● 8 నుంచి బెళగావిలో కార్యకలాపాలు ● భద్రత కోసం 6వేల మంది పోలీసులు ● సభ్యులు, అనుచరులకు 4 వేల గదులు ● ఏడాదికేడాది పెరుగుతున్న ఖర్చు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన ఆలోచనలకు తావివ్వరాదని రెండో రాజధాని తరహాలో ఉండేలా బెళగావిలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సువర్ణసౌధను నిర్మించారు. ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. డిసెంబరు 8న సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రెండు వారాలపాటు సాగే కార్యకలాపాలకు రూ.21కోట్లు ఖర్చు కానుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలకు భారీ భద్రత కల్పిస్తున్నారు. అదే తరహాలోనే బెళగావి సువర్ణసౌధలో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలకు భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాధారణంగా ఏటా 10శాతం ఖర్చు పెరగడం సహజం. అయితే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏకంగా 6వేలమందికిపైగా పోలీసు సిబ్బందిని నియమించారు. ఏటా 4వేల మంది మాత్రమే పోలీసులను విధులకు కేటాయించేవారు. 2023లో రూ.17కోట్లు ఖర్చు అంచనా వేశారు. కానీ ఏకంగా రూ.23కోట్లకు పెరిగింది. 2024లో భారీగా ఖర్చులు తగ్గించాలని జిల్లా యంత్రాంగం కట్టడి చేసింది. కేవలం రూ.15.34 కోట్లతోనే కలాపాలు కొనసాగించారు.

ఇప్పటివరకు 169.60 కోట్ల రూపాయలు బెళగావిలో జరిగిన శీతాకాల సమావేశాలకు ఖర్చు చేశారు. 2024 నాటికి ఇక్కడ 13సార్లు సమావేశాలు జరిగినట్టయ్యింది. ప్రస్తుతం 14వ శీతాకాల సమావేశాలు సువర్ణసౌధలో జరుగనున్నాయి. ఏటా 4వేలకుపైగా గదులను ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు కలాపాలలో పాల్గొనేవారికి కేటాయిస్తారు. ఇప్పటికే బెళగావి పరిధిలోని అన్ని హోటళ్లను జిల్లా యంత్రాంగం రిజర్వు చేసింది. ఒకవేళ అదనపు గదులు కావాలంటే హుబ్బళ్ళి, ధారవాడ నగరాలలో కేటాయిస్తారు. 2006లో శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావిలో ప్రారంభించారు. 2007, 2008, 2010, 2011 సంవత్సరాలలోనూ కలాపాలు జరగలేదు. అనంతరం 2012 నుంచి 2018 వరకు నిరంతరంగా సమావేశాలు కొనసాగాయి. 2019, 2020 లలో కోవిడ్ ప్రభావం తీవ్రంగా ఉన్న మేరకు రెండేళ్లు బెంగళూరుకే పరిమితం చేశారు. ఆ తర్వాత 2021 నుంచి నిరంతరంగా కొనసాగిస్తున్నారు.

● బెంగళూరు విధానసౌధ తరహాలోనే శాసనసభ స్పీకర్ ప్రత్యేక ఆసనానికి 42.93 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్టు సమాచారహక్కుచట్టం ద్వారా తెలుస్తోంది. పరిషత్ సభాపతి స్థానానికి మరమ్మతులకు రూ.1.98 లక్షలు ఖర్చు చేశారు. 2006 నుంచి 2013 వరకు స్పీకర్ కూర్చునే సీటు బాగుండేది కానీ బెంగళూరు విధానసౌధ తరహాలోనే మార్పు చేశారు. సువర్ణసౌధలో ప్రముఖుల 11 పెయింటింగ్‌లతోపాటు అనుభవమంటపంలో తైలవర్ణ చిత్రాలకు 67.66 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అయితే రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా బెళగావి సమస్యలు తీరడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భోజనాలకు ప్రాధాన్యం

ఈ ఏడాది భోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. బెంగళూరు నుంచి అధికమంది ఉద్యోగులు, అధికారులతోపాటు మీడియా ప్రతినిధులు కలాపాలలో భాగస్వామ్యులవుతారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో జొన్న వంటకాలకు ప్రాధాన్యం ఇస్తారు. పలుమార్లు అక్కడి వంటకాలు సరిపడక ఉద్యోగులతోపాటు ఇతరవర్గాలు ఇబ్బంది పడ్డారు. అందుకే అన్నిరకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు అనుగుణంగా ప్రత్యేక వంటకాల మెనూ కూడా ఉంది. రోజుకోప్రాంతం మెనూను అమలు చేయనున్నారు. భోజనంలో జొన్నరొట్టె, సజ్జరొట్టె, బియ్యపురొట్టె, చపాతితోపాటు పచ్చళ్లు, సాధారణ అన్నం, ఎర్రబియ్యంతో అన్నం, పెరుగన్నం ఉంచనున్నారు. కుందాపుర ప్రాంతం బెళగావికి అనుబంధమైన ప్రాంతాల్లో పేరొందిన కరదంటు, గజ్జరి హల్వా, మోతిచూర్, బెళె హల్వా వంటి పదార్థాలతోపాటు వివిధ రకాల స్వీట్లు తయారు చేయనున్నారు. గత ఏడాది ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి భోజనాలకు రోజుకు రూ.5 లక్షలు ఖర్చు అయ్యిందని అంచనా వేశారు. ప్రస్తుతం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

శీతాకాల సమావేశాలకు చేసిన ఖర్చు

సంవత్సరం	రూ.కోట్లలో..
2006	5
2009	9
2012	7.39
2013	14.4
2014	10.09
2015	6.95
2016	7.2
2017	21.59
2018	13.85
2021	15
2022	17.5
2023	23
2024	15.5
మొత్తం	169.60

హాస్యనటుడు ఉమేశ్‌కు సీఎం నివాళి



ఉమేశ్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి



ఉమేశ్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆదివారం ఉదయం కిద్వాయ్ ఆసుపత్రిలో ఆయన మృతి చెందారు. లివర్ క్యాన్సర్‌తో బాధపడుతుండేవారు. ఉమేశ్ వందలాది సినిమాలలో నటించారు. కన్నడ ప్రముఖనటులు రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, అంబరీశ్‌తోపాటు ప్రస్తుతతరం హీరోలతో ఆయన నటించారు. ఉమేశ్ పార్థివదేహాన్ని రవీంద్రకళాక్షేత్రలో అభిమానుల సందర్శనకోసం ఉంచారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినిమా నటులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళి అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాలలో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాలలో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాలలో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. అపారమైన అభిమానులు, బంధువులకు ఆయన దూరమయ్యారు. సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రాంతీయభాషల మనుగడ ముఖ్యమే : సీఎం 7

విమర్శలకు ఇదేనా సమయం?

● మోదీ ఉడుపి పర్యటనపైనా అవాకులేనా..
● ఖర్గే వ్యాఖ్యలపై మండిపడుతున్న నెటిజన్లు

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఉడుపిలో శ్రీకృష్ణుడి దర్శనం చేసుకునేందుకు వచ్చిన సందర్భంలోనూ రాష్ట్ర మంత్రి ప్రియాంక ఖర్గే పలు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ గ్రాంట్లు ఇవ్వాలని, మొక్కజొన్న, పెసలు, చెరకు రైతులకు గిట్టుబాటు ధర పెంచాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలోనే రాష్ట్రముఖ్యమంత్రి ఇటీవల ఢిల్లీలో ఇచ్చిన వినతిపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులపై నెటిజన్లు మండిపడుతున్నారు. మంత్రి ఖర్గేపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ప్రతి విషయానికి ప్రధానమంత్రి మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, పరిహారం ఇవ్వాలన్నా, రోడ్డు కావాలన్నా, కాలువ వేయాలన్నా ప్రధానిని ఉద్దేశించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని, రాష్ట్రప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నిస్తున్నారు. సొంత నియోజకవర్గం చిత్తాపురలో ప్రజలందరికీ తాగునీరు, రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో చెప్పగలరా అని సవాల్ విసురుతున్నారు. ఆలయానికి వెళ్లడం వారి వ్యక్తిగత నమ్మకం అని, ప్రధాని మోదీ దేవాలయానికి వెళ్తే మీకెందుకు కడుపు మంట అంటూ ప్రశ్నిస్తున్నారు. కేంద్రం నుంచి గ్రాంట్లు కోరడం తప్పు కాదని, కానీ ప్రతి విషయంలోనూ ముఖ్యమంత్రి, మంత్రి ప్రియాంకఖర్గేలు నిత్యం విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శిస్తున్నారు. దేశంలో ఎన్నిరాష్ట్రాలు ఉన్నాయి. ఎంతమంది ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారో పరిశీలించుకోవాలని వ్యాఖ్యలు చేస్తున్నారు.

వణికించిన దిత్వా

● నగరంలో రోజంతా మేఘావృతం
● అక్కడక్కడా చిరుజల్లులు
● చలిగాలులతో జనం విలవిల



మేఘావృతమైన విధానసౌధ ప్రాంతం

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావం రాష్ట్రంపైనా చూపింది. భారీ వర్షాలు లేకున్నా బెంగళూరు సహా రాష్ట్రమంతటా చలిగాలులు ప్రజలను వణికించాయి. నగరంలో ఆదివారం తెల్లవారుజామునుంచి రాత్రిదాకా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. తమిళనాడు తీరప్రాంతంలో వర్షాలు కురవడంతో రాష్ట్రవ్యాప్తంగా చలిప్రభావం చూపింది. బెంగళూరు గ్రామీణ, చామరాజనగర, మైసూరు, రామనగర, తుమకూరు, చిక్కబళ్లాపుర తోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాల్లోనూ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ పరిశోధనశాఖ అధికారి సీఎస్ పాటిల్ తెలిపారు. ఉదయం నుంచి ఎటుచూసినా చల్లగాలికి స్వెటర్లు, జర్కిన్‌లు ధరించే పనులకు వెళ్లారు. తీర ప్రాంత జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.



స్వెటర్లు ధరించి ప్రయాణం



కూలి పనులకు వెళ్తూ..

గ్యారెంటీల అమలుతో ప్రజల్లో విశ్వాసం

● చిన్ననీటి పారుదల శాఖ మంత్రి భోసరాజు
● ఇంటింటికీ ప్రభుత్వ పథకాల పోస్టర్ విడుదల

రాయచూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం గ్యారెంటీ పథకాలన్నింటిని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాన్ని పొందుతున్నట్లు రాష్ట్ర చిన్ననీటి పారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసరాజు అన్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో బూత్ కార్యక్రమం ఇంటింటికి ప్రభుత్వ పంచ గ్యారెంటీ పథకాల విజయం పోస్టర్‌ను ఆదివారం మంత్రి భోసరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి భోసరాజు, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఇతర రాష్ట్రాల కన్న అగ్రగామిగా నిలిచిందన్నారు. ఇచ్చిన 5 గ్యారెంటీలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజావిశ్వాసాన్ని పొందామని తమ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను సమపాళ్లల్లో అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి భోసరాజు

● వైభవంగా నీలమ్మదేవి, బసవేశ్వరుడి జోడు రథోత్సవాలు ● తరలివచ్చిన భక్తులు





రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, అలంకరణలో బసవేశ్వరస్వామి

కంప్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో ప్రసిద్ధిగాంచిన నీలమ్మదేవి, పేటే బసవేశ్వర స్వామి జోడు రథోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీలమ్మదేవికి పేట బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బసవేశ్వరస్వామి ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు జోడు రథాలను ఊరేగించారు. రథోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పూలు పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే గణేష్ రథోత్సవంలో పాల్గొని జోడు రథాలకు పూజలు చేపట్టి మొక్కులు సమర్పించుకున్నారు.



నీలమ్మ దేవి

వివాహం వేళ విషాదం

● గుండెపోటుతో వరుడి తండ్రి మృతి
● ఆగిపోయిన పెళ్లి




శరణయ్య (ఫైల్)

రాయచూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు భాజా భజంత్రీలు, బంధుమిత్రుల కేరింతలతో సంతోషంగా, ఉత్సాహంగా సాగుతున్న పెళ్లితంతు ఒక్కసారిగి మూగపోయింది. మరికొద్ది క్షణాలో వధువు మెడలో వరుడు తాళి కట్టే సమయంలో అకస్మాత్తుగా వరుడి తండ్రి శరణయ్య స్వామి(55) గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాయచూరు జిల్లాలోని సింధనూరు నగరంలో జైన్ కల్యాణ మండపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటన నగరంలో కలకలం రేపింది. జైన కల్యాణ మండపంలో శరణయ్య స్వామి కుమారుడికి వివాహం జరగాల్సి ఉండగా ఉదయం 5 గంటలకు ముహూర్తం నిర్ణయించారు. వధువు-వరుడుకి సంబంధించిన బంధువులందరూ వేడుక వద్ద కూర్చోని ఉన్నారు. తాళికట్టే వేళ వరుడి తండ్రి శరణయ్యస్వామి గుండెపోటుతో కుప్పకూలారు. దీంతో భాజభజంత్రీలు మోగాల్సిన సమయంలో బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. విషాద ఛాయలు నెలకొన్న పెళ్లి మండపంలో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయి పెళ్ళి అర్ధాంతరంగా వాయిదా పడింది.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

బెంగళూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): స్కూటర్‌పై తల్లిని ఆఫీస్‌కు తీసుకువెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం చెందారు. కంటైనర్ ఢీ కొనడంతో తల్లీకొడుకు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆదివారం ఉదయం మైసూరు రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. మైసూరు రోడ్డునుంచి కేఆర్ మార్కెట్‌వైపు స్కూటర్‌పై తల్లి అశ్విని (41), కుమారుడు అభిలాష్ (19) బయల్దేరారు. బ్యాటరాయనపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో వస్తుండగా కారు, కంటైనర్‌ల మధ్య కొంత స్థలంలోనే స్కూటర్‌తో ముందుకెళ్లాడు. కంటైనర్ పక్కకు తిప్పడంతో స్కూటర్‌నుంచి ఇద్దరూ కిందపడ్డారు. కంటైనర్ వేగంగా ఢీ కొనడంతో తల్లీకొడుకులు ఇద్దరికీ తీవ్రమైన గాయాలు తగిలాయి. ఇద్దరూ హెల్మెట్‌లు ధరించకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అశ్విని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తుండగా దొడ్డగొల్లరహట్టి నుంచి ఆసుపత్రికి డ్రాప్ చేసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. బ్యాటరాయనపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తల్లీ కొడుకు దుర్మరణంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు మిగిలాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.94	1629.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,235	2,860
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,322	6,441
నీటి నిల్వ (టీఎంసీలు)	69.96	93.57

4న ఆంజనేయస్వామి రథోత్సవం



ఆంజనేయస్వామి మూలవిరాట్

సిరుగుప్ప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న పేటె ఆంజనేయస్వామి 20వ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార తెలిపారు. ఆదివారం దేశనూరు రోడ్డు మార్గంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 4వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం పట్టణ పురవీధుల్లో పేటే ఆంజనేయస్వామి మహారథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వాముల వారికి ఉదయం గంగపూజలు, కుంభ మహోత్సవం పంచామృతాభిషేకం, పూర్ణకుంభాభిషేకం, మహామంగళహారతి, అన్నదాన సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.



సిద్ధమవుతున్న రథం

భాష ఏదైనా లక్ష్యం చేరుకోవాలి: మేయర్



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గాదెప్ప

బళ్లారి సిటీ,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏభాషలో చదివినా లక్ష్యం ముఖ్యమని, కన్నడలో చదివి ఎందరో ఉన్నతస్థానాలు సాధించారని మేయర్ గాదెప్ప అన్నారు. నగరంలోని మహాదేవ విద్య కళా సాంస్కృతిక ట్రస్ట్. కర్ణాటక రాష్ట్ర వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం అఖిల కర్ణాటక కన్నడ రాజ్యోత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని బీపీఎస్సీ పాఠశాలలోని శరణ భవన్‌లో 70వ కన్నడ రాజ్యోత్సవం, కన్నడ సాహిత్య సాంస్కృతిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ గాదెప్ప కర్ణాటక సాధక్ రత్న అవార్డును స్వీకరించి మాట్లాడారు. తాను 30సంవత్సరాలుగా కన్నడభాష సంస్కృతి కోసం పోరాడుతున్నానన్నారు. నామోదగి రాజకీయ గురువు దివంగత మాజీ ఎంపీ బసవరాజేశ్వరీ ఏదైనా సాధించాలంటే కొంత రాజకీయ సహకారం, శక్తి అవసరమన్నారు. పిల్లలు కళా సంస్కృతిని విద్యతో అనుసంధానించాలన్నారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ కన్నడను కాపాడడానికి అందరి సహకారం అవసరమన్నారు. తాను కన్నడ మీడియంలో చదివి డాక్టర్ అయ్యానని, ఏ భాషనైనా బాగా చదవాలన్నారు. ఇక్కడ జరుగాల్సిన అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం చాలా సమస్యల కారణంగా జరగడం లేదు. కనీసం వచ్చేఏడాది అయిననిర్వహించాలన్నారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మహాదేవ ఆర్ట్ అండ్ కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షురాలు మంగళ బసవరాజ్, బసవరాజు బిసలహళ్ళి, లింగాయత్ సంఘం అధ్యక్షుడు భద్రయ్య, ఉపాధ్యాయుల సహకార సంఘం అధ్యక్షుడు పంపనగౌడ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామబ్రహ్మం, కల్లుకంబ ప్రభు, రాజ శేఖర్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామయ్యను సీఎంగా కొనసాగించాలి

- హితరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టి ఎర్రిస్వామి

బళ్లారిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సిద్దరామయ్య రాజకీయాల్లో దాదాపు 40 యేళ్ల అనుభవం వున్న వ్యక్తి, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా సుమారు 16 బడ్జెట్‌లను సమర్పించడం ద్వారా దేశవ్యాప్తంగా విజయవంతమైన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని క్రాంతివీర్ సంగుణ్ణి రాయణ్ణ హితరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టి ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని పత్రికా భవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సిద్దరామయ్య తిరుగులేని ఓట్లను సేకరించి ప్రభుత్వానికి మెజారిటీని తీసుకువచ్చారని, ప్రస్తుత ప్రభుత్వంలోని 80 శాతం ఎమ్మెల్యేలు సిద్దరామయ్యకు అనుకూలంగా ఉన్నారన్నారు. ఆయనకు ఎట్టి పరిస్థితుల్లోను సీఎం పదవిలోనుంచి తప్పించరాదన్నారు. నిజానికి అహింద జనసంఘ్, క్రాంతివీర్ సంగొల్లి రాయణ్ణ పాడే కుటుంబ వర్గం మొత్తం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. రాబోయే అన్ని ఎన్నికలలో కురుబ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తాయని కూడా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సన్న విరుపాక్షప్ప, దుర్గేష్, ఉమేష్, కృష్ణ కే నాగరాజు, బెల్లి కట్టప్ప, సూర్య దేవ ప్రశాంత్ కుమార్, నాగరాజు, బీరప్ప, ప్రభాకర్ ఈ విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రక్షణ వేదిక అధ్యక్షుడు బట్టి ఎర్రిస్వామి



నిరసనలో ఏఐకేకేఎంఎస్ నాయకులు

జేపీపీఎం నాయకుల అరెస్ట్‌పై నిరసన

బళ్లారి సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో భూ ఆక్రమణకు వ్యతరేకంగా పోరాడుతున్న జెపీపీఎం నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఏఐకేకేఎంఎస్ రైతు సంస్థ కార్యకర్తలు ఆదివారం బళ్లారిలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సంస్థ జిల్లాకార్యదర్శి గురల్లి రాజా మాట్లాడుతూ 'జిందాల్ పోస్కో వ్యాసాది మంచ్' జేపీపీఎం కార్యదర్శి బెనుధర్ సర్దార్ మరో నలుగురు నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఒడిశా ప్రభుత్వం జిందాల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని పేదలు, గిరిజనులు అనేక సంవత్సరాలుగా నివసిస్తున్న భూమిని లాక్కోవాలని చూస్తోందన్నారు. ఒడిశాలోని కియోంజర్‌లో 10వేలకు పైగా స్థానిక ప్రజలు, గిరిజనులు,పేదలు ఇటీవల తీవ్ర పోరాటం చేశారన్నారు. ఈ పోరాటాన్ని అణచివేయడానికి నలుగురు నాయకులను వారు అరెస్టు చేశారని, అడ్డుకున్న ప్రజలపై అన్యాయంగా లాఠీచార్జ్ చేశారన్నారు. ఈ దారుణమైన చర్యను ఏఐకేకేఎంఎస్ రాష్ట్రకమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ రైతులకు ప్రాణాంతకమైన భూసేకరణను బీజేపీ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంఘం నాయకులు రుద్రయ్య, హొన్నూరస్వామి, విజయ్, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

రష్యన్ విప్లవ వార్షికోత్సవం



నినాదాలు చేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌యూసీఐ(కమ్యూనిస్ట్) పార్టీ కార్యాలయంలో ఆదివారం రష్యన్ విప్లవం 108 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ కన్వీనర్ ఎం.హెచ్.మంజుళ మాట్లాడుతూ చరిత్రలో అనేక విప్లవాలు జరిగాయని, అయితే 108సంవత్సరాల క్రితం జరిగిన రష్యన్ సోషలిస్ట్ విప్లవం మనిషిని మనిషి దోపిడి చేయడాన్ని నిర్మూలించి దోపిడీ రహిత వ్యవస్థను స్థాపించిందన్నారు. సమాజం ముందుకు రావాలంటే భావజాలం, నాయకత్వం, పార్టీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి మార్పుకు ముందు సాహిత్యం, సంస్కృతి, జీవనశైలిలో కొత్త ఆదర్శాలు ఉండాలన్నారు. ఈసందర్భంగా పాలాక్ష, ప్రశాంత్, ప్రకాశ్‌నాయక్, గెద్దలగత్తె శ్రీనివాస్, హర్ష బసవనదుర్గ, హిరేహడగలి ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలపై అవగాహన తప్పనిసరి

- సుధాకర్ పైప్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

బళ్లారి సిటీ,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి స్థూల, సూక్ష్మ పరిశ్రమ వ్యవస్థాపకుడికి రాబడి, లాభాలపై అవగాహన ఉండాలని సుధాకర్ పైప్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. నగరంలోని కౌల్‌బజార్‌ని మహమ్మదీయ కళాశాల సమీపంలోని గార్మెంట్ రీసెర్చ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆడిటోరియంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ, జిల్లాపరిశ్రమల కేంద్రం ర్యాంప్ పథకం కింద నిర్వహించిన వర్తకాలు పర్యావరణ నిర్వహణ(ఈఎస్‌ఎం) పై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫ్యాక్టరీలు, కొనుగోలుదారుల సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ వరుణ్ మాట్లాడుతూ ప్రతి వ్యవస్థాపకుడు తాము తయారు చేసే ఉత్పత్తుల పర్యావరణ నిర్వహణ గురించి తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. జీఆర్‌టీడీఎస్ ప్రిన్సిపాల్ బిందు మాట్లాడుతూ ఫ్యాషన్ రంగంలోని ట్రేడ్‌లు ,ఈఎస్‌ఎం పథకాలను యువ పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వర్క్‌షాపులో వ్యాపారాలు, పర్యావరణ స్థిరత్వ నిర్వహణ(ఈఎస్‌ఎం) సౌకర్యాలు, విజయగాథల గురించి అవగాహన కల్పించారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమేశేఖర్, ట్రేడ్స్ రిసోర్స్ పర్సన్లుగా జీఆర్‌టీడీసీకి చెందిన బాలచంద్ర, మంజునాథ్ బొల్లోల్లి, పంపనగౌడ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

డీఎంకేలోకి 2వేల మంది చేరిక



వేదికపై మంత్రి చక్రపాణి, ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

హోసూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హోసురు సమీపాన ఎన్‌పీ అగ్రహారం వద్ద ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి చక్రపాణి సమక్షంలో 2వేల మందికి డీఎంకేలో చేరారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, అచెట్టిపల్లి పంచాయతీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, అన్నాడీఎంకే యూనియన్ డిప్యూటీ సెక్రటరీ నవీన్‌తోపాటు వారి అనుచరులు డీఎంకేలో చేరారు. హోసూరు ఎమ్మెల్యే వైప్రకాశ్, మేయర్ సత్య అందరినీ స్వాగతించారు. మంత్రి చక్రపాణి మాట్లాడుతూ డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ 2021లో సీఎంగా బాధ్యతలు చేపట్టారని, ఇచ్చిన హామీలు నెరవేర్చారన్నారు. హోసూరు నగరాన్ని ప్రపంచం మెచ్చుకునే ప్రదేశంగా మార్చారన్నారు. వివిధ దేశాల సంస్థలు ఇక్కడ ఫ్యాక్టరీలు స్థాపించాయన్నారు. ముఖ్యమంత్రి ఇటీవలే హోసూరులో వివిధ కర్మాగారాలకు శంకుస్థాపన చేశారని, వివిధ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు జరిగాయన్నారు. కృష్ణగిరి జిల్లాలోనే 86,000 మందికి భూమి పట్టాలు జారీ చేశారన్నారు. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్ కొత్త ముసాయిదా ఓటరు జాబితా (ఎస్ఐఆర్) విధానాన్ని ప్రవేశపెట్టారని అమలుకు అధికారులతోపాటు మన పార్టీ తరఫున సహకారం అందించాలన్నారు. ఒక్కో పట్టా విలువ అనేక లక్షలు ఉందని, చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి పట్టాను ప్రజలకు ఇచ్చి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని చక్కగా నిర్వహిస్తున్నారన్నారు. హోసూరు నగరం నేడు ఒక పెద్ద కార్పొరేషన్‌గా ఎదిగిందని, వివిధ పరిశ్రమలు, సంస్థలు వచ్చాయని, విద్యావంతులైన యువత ఉపాధి పొందుతున్నారన్నారు. 2026లో మళ్ళీ డీఎంకే అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. డీఎంకే పార్టీలో చేరిన వారందరినీ స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ చైర్మెన్ యువరాజ్, మాజీ ఎమ్మెల్యేలు మురుగన్, సెంగొట్టువన్, జిల్లా నిర్వాహకులు సుగుమారన్, చిన్నస్వామి, జయరామన్, రాష్ట్ర జట్టు సహాయ నిర్వాహకులు యువబృందం శ్రీనివాస్, కళలు-సాహిత్య బృందం కార్యదర్శి మాదేశ్వరన్, యూనియన్ కార్యదర్శి రామమూర్తి, ఏరియా కార్యదర్శులు ఆనందయ్య, రాము, గోపి, రమేశ్ త్యాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై నిరసన



రాంనగర్‌లో అన్నా విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హోసూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జారీ చేసిన కార్మిక కోడ్ 4 చట్టాలను వ్యతిరేకిస్తూ రాంనగర్‌లోని అణ్ణా విగ్రహం వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యూ డెమోక్రటిక్ వర్కర్స్ ఫ్రంట్ జిల్లా కార్యదర్శి శంకర్ నాయకత్వం వహించారు. జిల్లా కార్యదర్శి సంతోశ్, తమిళ జాతీయ రిపబ్లిక్ ఉద్యమ తమిళరసన్, వెంకటేశన్, రవించంద్రన్, మరియు వనవేందన్‌లు ప్రసంగించారు. నిత్యావసర ధరల నియంత్రించాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించరాదని, ఖాళీలను భర్తీ చేయాలని, అవుట్‌సోర్సింగ్ తొలగించాలని, కనీసవేతనం రూ.20వేలుగా నిర్ణయించాలని, కనీస పింఛను రూ.9వేలు అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను పర్మనెంట్ చేయాలని, మోటారు వాహనాల సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ పంటలకు కనీసమద్దతుధరలు నిర్ణయించాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. నిరసనలో ప్రజాశక్తి జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బళ్లారిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ కన్నుమూసింది. బళ్లారి తాలుకాలోని పీడీహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగింది. అనంతపురం జిల్లా డి హిరేహాళ్ గ్రామానికి చెందిన నిర్మల (30)తమ భర్త, కుమారుడు ముగ్గురు ద్విచక్ర వాహనంపై నవంబర్ 27న టీబూదిహాళ్ గ్రామానికి పనులపై వెళ్లి తిరిగి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి వారు కింద పడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం నిర్మల మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏకీకరణకు కృషి చేసిన నాయకులను మరువరాదు

- రాజ్యోత్సవంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్
- విజయ సాధకులకు సత్కారం



పలు రంగాల్లో రాణించిన వారిని సత్కరిస్తున్న కన్నడ హితరక్షణ సమితి సభ్యులు

కంప్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రాన్ని ఏకం చేసి దాని ఏకీకరణకు కృషి చేసిన నాయకులను గుర్తించుకోవడం మనందరి కర్తవ్యమని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అన్నారు. కన్నడ హితరక్షణ సంఘం కంప్లి తాలుకా శుక్రవారం రాత్రి పట్టణంలోని వీరశైవ సంఘ ప్రాంగణంలో నిర్వహించిన 70వ కర్ణాటక రాజ్యోత్సవం, సంఘ 55వ వార్షికోత్సవ పాల్గొని తెలిపారు. మన భాష, సంస్కృతి దేశంలోనే ఒక నమూనా అన్నారు. అనేక ప్రాంతాల ప్రజలు మన భాషను చాలా సులభంగా నేర్చుకున్నారు. మనతో నివసిస్తున్నారు. కన్నడ రాష్ట్రాన్ని ఐక్య రాష్ట్రంగా మార్చడానికి చాలామంది గొప్ప వ్యక్తులు కృషి చేస్తున్నారని వారందరినీ గుర్తుంచు కోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్యను అందించడంలో ముందుండాలని ఆయన అన్నారు. సంఘ అధ్యక్షులు బూదగుంప అంబన్న మాట్లాడుతూ కన్నడ భాష రుచి వాతావరణాన్ని సృష్టించే పని చాలా సంవత్సరాలుగా జరుగుతోందన్నారు. వారు కన్నడ భూమి, నీరు, భాష కోసం పోరాడుతున్నారు. కన్నడ ప్రజలు విశాల హృదయాలు అయితే మనం మన గుర్తింపును వదులుకోకూడదన్నారు. కన్నడకు మరింత ఐక్యత, ఏకాభిప్రాయం అవసరమన్నారు. శరణ సాహిత్య పరిషత్ బళ్లారి జిల్లా అధ్యక్షులు సిద్దరామ కల్మట్ మాట్లాడుతూ సమైక్య పోరాటంలో అమరులైన పెహల్వాన్ రంజన్ సాబ్ బళ్లారికి చెందిన వారని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోరాటం బళ్లారిలోనే తొలి విజయాన్ని సాధించింది. కన్నడ భాషను కాపాడుకోవడం, అభివృద్ధి చేయడం అందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఎంకే హేమయ్యస్వామి, పరిచయ ప్రసంగం చేశారు. వీరశైవ సంఘం అధ్యక్షులు మూకయ్యస్వామి సమావేశానికి అధ్యక్షత వహించారు. చిదానంద, యోగా ఉపన్యాసకులు పూజ, జిల్లా కన్నడ రాజ్యోత్సవ అవార్డు గ్రహీత బంగి దొడ్డ మంజునాథ, బుర్రకథ కళాకారుడు జంబక్క, జయలత, కళాకారుడు చన్నదాసర మారెప్ప, కర్ణాటక రాష్ట్ర వర్కింగ్ ద్యామనగౌడ, చంద్రశేఖరగౌడ, క్రీడాకారులు జ్యోతి, శషబి, మల్లీశ్వరి, కన్నడలో వంద శాతం మార్కులు సాధించిన ఇతర విద్యార్థులను అభినందించి సన్మానించారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా ముఖ్య అధికారి మల్లికార్జున, యంకప్ప, శ్రీనివాస్, మహబూబ్, యంకారెడ్డి, బసవరాజు, అంబిగర మంజునాథ్, నారాయణప్ప, అశోక, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ రేకు కవితా సంపుటి విడుదల



గులాబీ రేకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తోరణగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు గాయత్రి రాసిన 'గులాబీ రేకు కవితా సంపుటి'ని ఆదివారం విడుదల చేశారు. కర్ణాటక సాహిత్య అకాడమీ సాహిత్య శ్రీప్రశస్తి పొందిన అబ్దుల్ హైతును ఘనంగా సత్కరించారు. గులాబీ రేకు కవితా సంపుటిని జిందాల్ ఆదర్శ విద్యాలయం సభా భవనంలో ముఖ్యఅతిథుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కిష్కింద విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ మంజునాథ, జిందాల్ విద్యానగర్ జీవీఎం పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరశర్మ జిందాల్ శంకర్ గూడా పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, ప్రముఖులు నారప్ప తదితరులు పాల్గొన్నారు. బైలాట కళా విధులు బండ్రి లింగప్ప సాహితీవేత్త సికిందర్ పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచ్చీరప్ప తాత ఆలయంలో అఖండ భజన

సిరుగుప్ప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉచ్చీరప్ప తాత ఆలయంలో అఖండ భజన శనివారం వైభవం జరిగిందిగాఆలయ కమిటీ అధ్యక్షుడు కుంబారు ఉచ్చీరప్ప ఆధ్వర్యంలో అఖండ భజనలు నిర్వహించారు. తాత వారి సేవలు కొనియాడుతూ భజన రూపంలో ఆయనను స్మరిస్తూ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ భజన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు వందలాదిమంది తరలివచ్చారు.

మూఢ నమ్మకాలే శాస్త్రీయతకు సవాల్

- మహానగర పాలికె సీనియర్ సభ్యుడు జయణ్ణ

రాయచూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజం శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్నా వ్యక్తుల్లోని మూఢనమ్మకాలు సైన్స్‌కు సవాలుగా మారాయని మహానగర పాలికె సీనియర్ సభ్యుడు జయణ్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యవంతులను చేసే దిశగా విజ్ఞానవంతులు తమ కృషిని మరింత ముందుకు సాగించాలని కోరారు. ఆదివారం నగరంలోని కన్నడ భవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజాప్రభుత్వంలో కీలక భాగస్వాములుగా ఉన్న ప్రజాప్రతినిధులు సహితం మూఢ నమ్మకాల పట్ల ఎక్కువగా మక్కు చూపుతుండడం సమస్యగా మారిందన్నారు. మూఢ నమ్మకాలు ప్రజలను విపరీతంగా ఆకర్షిస్తుండడాన్ని ప్రస్తావించిన జయణ్ణ, శాస్త్ర సాంకేతిక రంగాల పై ప్రజల్లో విస్తృత అవగాహనం కల్పించే బాధ్యత ప్రతియొక్కరది అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పలు కీలక అంశాల పై పలువురు వక్తలు తమ ప్రసంగంలో వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకురాలి మృతి



అక్కమహాదేవి(ఫైల్)

రాయచూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా కలమంగి వద్ద ఆదివారం మధ్యహ్నాం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో వెళుతున్న అధ్యాపకురాలు అక్కమహాదేవి(36) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. తన కుటుంబంతో కలిసి ఒక వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న అక్కమహాదేవి కుటుంబం ప్రయాణిస్తున్న కారు గడ్డి లోడ్‌తో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృత్యువాతపడగా భర్త ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయాలపాలైయ్యారు. వీరిని సింధనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్

- కొనసాగిన హేమచంద్ర ఆధిపత్యం

బళ్లారి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) హొస్పేట్‌లోని డీఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగుతోంది. 200 మీటర్ల పరుగు పందెంలో డీఏఆర్ ఆర్మ్‌డ్ పోలీస్ కానిస్టేబుల్ హేమచంద్ర మొదటి స్థానం సాధించి తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా వ్యక్తిగత ఛాంపియన్ టైటిల్‌ను గెలుచుకోవాలని పోటాపోటీగా సాగుతున్నారు. గత సంవత్సరం కొత్తూరు పీఎస్ఐ గీతాంజలి షిండే మహిళల విభాగంలో మహిళల విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌గా నిలిచింది. షాట్‌పుట్. జావెలిన్‌త్రోలో మొదటి స్థానం సాధించడం ద్వారా తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. హేమచంద్ర మరోసారి 200 మీటర్లు పరుగుపందెంలో విజయం సాధించడంతో పలువురు అధికారులు ఆయన్ని అభినందించారు.



లాంగ్ జంప్ చేస్తున్న ఆర్మ్‌డ్ కానిస్టేబుల్ హేమచంద్ర

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నార్ల వెంకటేశ్వరరావు (జయంతి)



వీఆర్ నార్లగా సుపరిచితులైన ప్రముఖ రచయిత నార్ల వెంకటేశ్వరరావు 1908 డిసెంబరు 1న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలకు చాలా కాలం సంపాదకులుగా వ్యవహరించారు. పలు నాటికలు, కథలు రాశారు. జర్నలిజానికి ఎనలేని సేవలు అందించారు. హేతువాదిగా, మానవతావాదిగా జీవించారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించారు. బౌద్ధ కళలపట్ల ప్రత్యేక అభిమానం కల్గినవారు. 1985 ఫిబ్రవరి 16న కన్నుమూశారు. కుటుంబీకులు ఆయన రచనలను అన్నీ కూర్చి ఇటీవలే 'నార్ల రచనలు'గా పలు విభాగాలుగా వెలువరించారు.

వ్యాసరాయ బల్లాళ (జయంతి)



కన్నడ సాహితీవేత్త వ్యాసరాయ బల్లాళ 1923 డిసెంబరు 1న కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా అంబలపాడిలో జన్మించారు. 'బండాయ', 'హేమంత గాన', అనురక్త, వాత్సల్యపథ, 'ఉత్తరాయణ' తదితర రచనలు పేరొందాయి. 25 నవలలు, వందలాది కథలు రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, గద్యభాస్కర అవార్డు, కర్ణాటక సాహిత్య అకాడమీ గౌరవ పురస్కారం తదితర పురస్కారాలు అందుకున్నారు. 2008 జనవరి 30న కన్నుమూశారు.

విజయలక్ష్మి పండిట్ (వర్ధంతి)



విజయలక్ష్మి పండిట్ 1900 ఆగస్టు 18న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్) లో జన్మించారు. అసలుపేరు స్వరూప్ కుమారి నెహ్రూ. స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ అగ్రనేత మోతీలాల్ నెహ్రూ కుమార్తె. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ తొలి మహిళా అధ్యక్షురాలిగా వ్యవహరించిన ఘనత ఆమెకే దక్కుతుంది. మహారాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించారు. 1967-71ల మధ్య లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగారు. పలు దేశాలకు రాయబారిగా వ్యవహరించారు. 1990 డిసెంబరు 1న కన్నుమూశారు.

ఉదిత్ నారాయణ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత ఉదిత్ నారాయణ్ 1955 డిసెంబరు 1న నేపాల్‌లో జన్మించారు. రేడియోలో ఏడేళ్లపాటు స్టాఫ్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. ఆయన ప్రతిభను మెచ్చి అక్కడి భారతీయ ఎంబసీ అధికారులు భారతీయ విద్యాభవన్‌లో శాస్త్రీయ సంగీతం నేర్చుకునేలా ప్రోత్సహించారు. ప్రత్యేకించి బాలీవుడ్‌లో నేపథ్య గాయకుడిగా రాణించగా, భారతీయ భాషలలోనూ, నేపాలీలోనూ పేరొందారు. 34 భాషల్లో 25వేలకుపైగా పాటలు పాడారు. మూడు దశాబ్దాలకుపైగా జాగరణ్ ఫిల్మ్‌ఫెస్టివల్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పద్మశ్రీ, మిర్చి మ్యూజిక్, 4 జాతీయ, 5 ఫిల్మ్‌ఫేర్‌తోపాటు అంతర్జాతీయ, జీవిత సాఫల్య తదితర పురస్కారాలు పొందారు.

అర్జున రణతుంగ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ అర్జున రణతుంగ 1963 డిసెంబరు 1న శ్రీలంక దేశం గంపహ ప్రాంతంలో జన్మించారు. శ్రీలంక క్రికెటర్‌గా పేరొందారు. ఆయన కేప్టెన్సీలో 1996లో క్రికెట్ వరల్డ్‌కప్ కైవశం చేసుకున్నారు. 11ఏళ్లపాటు కేప్టెన్‌గా కొనసాగారు. ఎడమచేతి బ్యాటింగ్ శైలితో వన్డే క్రికెట్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2001లో క్రికెట్‌నుంచి రిటైరయ్యాక శ్రీలంక క్రికెట్ అడ్మినిస్ట్రేషన్‌లో పలు హోదాలలో కొనసాగారు. రాజకీయాల్లో రాణించి మంత్రిగా వ్యవహరించారు.

సౌరభ్ రాజ్ జైన్ (పుట్టినరోజు)



సౌరభ్‌రాజ్ జైన్ 1985 డిసెంబరు 1న ఢిల్లీలో జన్మించారు. నటుడు, మోడల్‌గా రాణించారు. మహాభారత్‌లో శ్రీకృష్ణ పాత్రలోనూ, దేవోంకి దేవ్ మహదేవ్‌లో శ్రీమహావిష్ణువు పాత్రలోనూ పేరొందారు. అనేక బుల్లితెర సీరియల్స్‌తోపాటు సినిమాలలో నటించారు. 2019 డ్యాన్స్ రియాలిటీ సిరీస్ షోలలో కూడా పాల్గొని సత్తా చాటుకున్నారు.

కన్నడ భాషాభిమానం పెంచుకోవాలి



కన్నడ రాజ్యోత్సవంలో శేఖర్‌గౌడ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతాల్లో తెలుగు, తమిళుల ప్రభావం ఉన్నా రాష్ట్రంలోనివారు కన్నడ భాషాభిమానం పెంచుకుని అన్ని వ్యవహారాలలో కన్నడ వినియోగించాలని రాష్ట్ర ఒక్కలిగ సంఘం డైరెక్టర్ శేఖర్‌గౌడ పిలుపునిచ్చారు. తాలూకాలోని హెచ్ క్రాస్‌లో కన్నడ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్నడ రాజ్యోత్సవంలో కన్నడ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఉంటున్నవారు కన్నడ భాషను నేర్చుకోవాలన్నారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కన్నడ అభిమానుల సంఘం అధ్యక్షుడు అంబరీశ్‌గౌడ, ఉపాధ్యక్షుడు మునేగౌడ, నారాయణస్వామి, మునిరాజు, హెచ్‌క్రాస్ మంజునాథ్, జడ్పీ మాజీ అధ్యక్షురాలు సవితాగౌడ, ఆటో డ్రైవర్ల సంఘం పదాధికారులు పాల్గొన్నారు.



ఫ్లవర్ షోలో సందడి



గజరాజు నమూనా వద్ద..

కబ్బన్ పార్కులో సండే సందడి

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో నగరంలోని కబ్బన్‌పార్కులో నిర్వహిస్తున్న ఫలపుష్ప ప్రదర్శనను వీక్షించేందుకు నగర ప్రజలు తరలివచ్చారు. సెలవురోజు ఆదివారం సందర్శకులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించగా ఆసక్తిగా పాల్గొన్నారు. రంగవల్లుల పోటీలలో రాఘవేంద్రస్వామి చిత్రం నమూనా, పెద్ద చుక్కల ముగ్గు అలరించాయి. ఓవైపు చిరుజల్లులు కురుస్తూ, మేఘావృతమై ఉన్నా ప్రదర్శనను వీక్షించేందుకు ఆసక్తి చూపారు. అందంగా రూపొందించిన సీతాకోక చిలుక, డాల్ఫిన్స్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం ఆకులు, చామం, రోజా పుష్పాలతో ఏనుగు రూపం ఆకట్టుకుంది. ఫోటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ప్రజలు పోటీ పడ్డారు. డిసెంబరు 7తో ప్రదర్శన ముగియనుంది.



ముగ్గులను వీక్షిస్తున్న జనం

ప్రాంతీయ భాషల మనుగడ ముఖ్యమే



అరెభాష అకాడమీ గౌరవ పురస్కారాల ప్రదానోత్సవంలో సీఎం సిద్ధరామయ్య తదితరులు

» సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా కన్నడ భాష మాట్లాడుతున్నా ఉత్తర కన్నడ, దక్షిణకన్నడ జిల్లా ప్రాంతాలలో తుళు, కొంకణి భాషలతోనూ దశాబ్దాలుగా గడిపేవారు ఉన్నారని ప్రాంతీయ భాషల మనుగడ ముఖ్యమేనని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయ పడ్డారు. ఈ రెండుభాషలు కన్నడకు శక్తినిచ్చేవన్నారు. నగరంలోని రవీంద్రకళాక్షేత్రలో అరెభాష సంస్కృతి సాహిత్య అకాడమీ, మడికేరి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దక్షిణకన్నడ, కొడగు జిల్లాల్లో అరెభాష గౌడలు జీవిస్తున్నా రన్నారు. వీరు 3లక్షల మందిదాకా ఉన్నారన్నారు. 1882లో గెజిట్ వచ్చినప్పుడు సకలేశపురలో ఉండేవీరు కరువును తట్టుకోలేక, హేమావతి నది సమీపంలోని సుళ్యప్రాంతానికి వెళ్లారన్నారు. తుళు, కొంకణి భాషలు మాట్లాడేవారు ఇప్పటికీ పలు జిల్లాల్లో ఉన్నారన్నారు. కర్ణాటకలో 230 చిన్నభాషలు ఉన్నాయని గుర్తు చేశారు. భాగమండలలో నాడగౌడ సమాజానికి గతంలో కోటి రూపాయలు ఇచ్చానని, ప్రస్తుతం రూ.50 లక్షలు గ్రాంటు కోరారని మంజూరు చేశానన్నారు. అరెభాష అకాడమీ గౌరవ పురస్కారాన్ని కేఆర్ గండాధార, యూపీ శివానంద, డీఎస్ ఆనందలకు ప్రదానం చేశారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రి బైరతి సురేశ్, సీఎం న్యాయ సలహాదారుడు, ఎమ్మెల్యే పొన్నణ్ణ, అంతరగౌడ, కన్నడ అభివృద్ధి ప్రాధికార చైర్మన్ పురుషోత్తమ బిళిమలె, అరెభాష సంస్కృతి సాహిత్య అకాడమీ చైర్మన్ సదానంద మావజీ, కన్నడ సంస్కృతిశాఖ డైరెక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

దొమ్మసంద్రలో వైద్య శిబిరం

దొమ్మసంద్ర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్ర గ్రామం హౌసింగ్ బోర్డు ప్రభుత్వ స్వాతంత్ర్య పీయూ కళాశాల ఆవరణలో బృహత్ ఆరోగ్య శిబిరం, 70వ కన్నడ రాజ్యోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిగింది. కర్ణాటక జాగృతదళ అధ్యక్షులు శివశంకర్ నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీ శివణ్ణ కూడా బీపీ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇటీవలికాలంలో పని ఒత్తిళ్లలో ఆరోగ్యంపట్ల తగిన దృష్టి సారించలేదన్నారు. ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రి నారాయణ నేత్రాలయ, బయో కాన్ ఫౌండేషన్ సహకారంతో పరీక్షలు నిర్వహించారు. స్తన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతోపాటు నేత్ర పరీక్షల అనంతరం అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షల తర్వాత ఔషధాలు అందచేశారు. కర్ణాటక జాగృతిదళ హోసబెళకు సేవా ట్రస్టు, సాయివినోద్ చారిటబుల్ ట్రస్టు, కావేరమ్మ దేవస్థాన సమితి ట్రస్టులు శిబిరానికి సహకారం అందించాయి. స్థానికులు శిబిరంలో పాల్గొని ప్రయోజనాలు పొందారు. కర్ణాటక జాగృతిదళ అధ్యక్షుడు శివశంకర, గౌరవాధ్యక్షుడు నాగలేఖ, ఉపాధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి నాగేశ్, సంపంగి, సంతోష్, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ సభ్యుడు కే సురేశ్, మాజీ సభ్యుడు ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు వికాస్‌రెడ్డి, హోసబెళకు ట్రస్టు సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే శివణ్ణ

మానవత్వంతోపాటు సాంకేతికతను పెంపొందించుకోండి



పట్టాల ప్రదానోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో రాణించడం ముఖ్యమేనని అయితే మానవత్వం కూడా పెంపొందించుకునే దిశగా విద్యార్థులు పాటుపడాలని యాక్సిస్ బ్యాంకు హెచ్‌ఆర్ మేనేజర్ రాజ్ కమల్ వెంప తి అభిప్రాయ పడ్డారు. మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ బెంగళూరు క్యాంపస్‌లో 33వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. 746 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అందులో 12మందికి పీహెచ్‌డీలు పొందగా ముగ్గురికి డాక్టర్ టీఎంఏ పై బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. ప్రొ-వైస్ చాన్స్‌లర్ హెచ్‌ఎస్ బల్లాళ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాజ్‌కమల్ వెంపతి మాట్లాడుతూ ఏఐ సాంకేతిక అన్ని రంగాలలోనూ అనుసంధానం అవుతోందని తద్వారా వేగవంతమైన ప్రక్రియ జరుగుతుం దన్నారు. సాంకేతిక విద్య పూర్తి చేసినవారు మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ కావాలని సూచించారు. వృత్తి జీవనం ఎప్పుడూ సమాంతరంగా ఉండదని, అనేక మలుపులు అని శృతిని అధిగమించాలన్నారు. ఇండస్ట్రీకి రెడీ అనే లాంటి బోధనలు మణిపాల్‌లో సాధ్యమవుతు న్నాయన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ఎండీ వెంకటేశ్, రియానా ఛటోపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

21న సీపీఎం నిరసన

బాగేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ బెంగళూరులో డిసెంబరు 21న నిరసన చేపట్టనున్నట్టు సీపీఎం నాయకుడు డీటీ మునిస్వామి తెలిపారు. పట్టణంలోని 5, 6, 7 వార్డులలో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేసి, విరాళాల సేకరణ చేపట్టి మాట్లాడారు. డిసెంబరు 15వరకు ఇంటింటికీ తిరిగి కరపత్రాల పంపిణీ, విరాళాలు సేకరిస్తామన్నారు. బయలుసీమ జిల్లాలైన బెంగళూరు గ్రామీణ, చిక్కబళ్లాపుర, కోలారు ప్రాంతాలకు స్వాతంత్ర్యం పూర్వంనుంచి శాశ్వత నీరావరి పథకం కోసం పోరాటాలు సాగుతున్నాయన్నారు. మూడు దశాబ్దాల నిరంతరం పోరాటం అనంతరం 15ఏళ్లక్రితం ఎత్తినహొళె పథకంపేరిట జాప్యం చేశారన్నారు. చిక్కబళ్లాపుర జిల్లాలో వసతి, భూమి, స్మశాన, రైతులు, కార్మికులు, మహిళల, దళితుల, కూలికార్మికుల సమస్యలపై నిరసన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీపీఎంకు చెందిన వాల్మీకి అశ్వత్థప్ప, ఎస్ఎఫ్ఐ తాలూకా నాయకుడు సోము, ఇమ్రాన్, రవణప్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నాణ్యమైన ఆహారంతో ఆరోగ్యం



ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డికి సన్మానం

» ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన రుచికరమైన ఆహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బేగూరు రోడ్డు బొమ్మనహళ్ళిలో జీఆర్ రుచికర హోటల్‌ను ప్రారంభించి మాట్లాడారు. నగరంలో ఇటీవలికాలంలో హోటళ్లు ఏర్పాటవుతున్నాయన్నారు. అక్కడ పరిశుభ్రత పాటించి నాణ్యమైన ఆహారం అందిస్తేనే ఆదరణ సాధ్యమన్నారు. కొన్ని హోటళ్లలో రుచి ఉన్నా సరైన పర్యవేక్షణ కొరవడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు తరచూ తనిఖీలు చేయాల్సి ఉందన్నారు. ఇక్కడ శుభ్రత పాటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే నాణ్యత పాటించాలని హోటల్ యజమాని గోపాల్‌రెడ్డికి సూచించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హోటల్‌కు అవసరమైన మసాలాలను ఇంట్లోనే సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా తొలిరోజు కస్టమర్లకు భోజనం ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేను మైసూరు తలపాగాతో సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమాజీ మంత్రి ఆనేకల్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి - 8 మంది అరెస్టు

చింతామణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బట్లహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట అడ్డాపై చింతామణి ఉపవిభాగం డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ.84వేల నగదు, ఒక కారు, 8 మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల సందర్భంగా మునిరాజు అనే వ్యక్తి తప్పించుకుని పరారయ్యాడు. జిల్లా ఎస్పీ కుశాల్‌చౌక్సి మార్గదర్శకంలో కార్యాచరణ జరిగింది. జీ భత్తహళ్ళి గ్రామశివారులోని తోపుమధ్యలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశారు. సరిహద్దులోని ఇతర ప్రాంతాలవారు సైతం పేకాట ఆడుతున్నారన్నారన్నారు. వెంకటరెడ్డి, చాంద్‌పాషా, ఈశ్వరప్ప, అశోకరెడ్డి, జయరాం, చంద్రమోహన్, సోమకలహళ్ళికి చెందిన దర్శన్, చిన్నపల్లికి చెందిన మధులు పట్టుబడ్డారన్నారు. మునిరాజు పరారయ్యాడన్నారు.

పట్టుబడిన ఆర్ఐకి రిమాండ్

హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన హిందూపురం మున్సిపల్ ఆర్ఐకు ఏసీబీ కోర్టు రిమాండు విధించినట్లు ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు ఖాళీ స్థలానికి ట్యాక్స్ తగ్గిస్తామని చెప్పి ముద్దిరెడ్డిపల్లికి చెందిన రవికుమార్ నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఆయన్ను ఆదివారం కర్నూలులోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తివద్ద ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు చిత్రకళ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ముళబాగిలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశలోనే చిత్రకళను అభ్యాసం చేయడం ద్వారా రానున్న రోజుల్లో చిత్రకళతో జీవనోపాధి పొందవచ్చునని వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ ప్రమోద్‌బాబు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఆచంపల్లి గ్రామం ప్రభుత్వ కన్నడ ప్రాథమిక పాఠశాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జలానయన మహోత్సవాన్ని పురస్కరించుకుని మట్టి, నీటి సంరక్షణపై డ్రాయింగ్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌బాబు మాట్లాడుతూ చిత్రకళకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సృజనాత్మకతను పెంచేవాటిలో చిత్రకళ కూడా ఒకటని, పాఠాలతోపాటు ఆసక్తికగలవారు నేర్చుకోవాలని, ఇందులో రాణిస్తే ఉద్యోగ ఉపాధి సాధ్యమన్నారు. కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి తాలూకా అధ్యక్షుడు కేఎన్ తాయలవరప్ప మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహించే కార్యక్రమాలు, పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుళమ్మ, తాయలూరు వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సమగ్ర ఆరోగ్యం

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం సమకాలీన సౌకర్యం సూచిస్తుందని తద్వారా సమగ్ర ఆరోగ్యం సాధ్యమని పలువురు ఆయుర్వేద నిపుణులు అభిప్రాయపడ్డారు. స్థానిక లలిత్ అశోక్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ కేరళ ఆయుర్వేద వైద్యానికి పేరొందిందని లలిత్ రిసార్ట్స్ పేరిట ఆయుర్వేద సమకాలీన సౌకర్యాలను సమకూర్చిందన్నారు. వ్యక్తిగత చికిత్సలు, సాత్విక ఆహార పద్ధతి, యోగా, ధ్యానం, జీవనశైలి వంటి మార్గదర్శకాలను ఇక్కడ బోధిస్తారన్నారు. ఆయు ర్వేద వైద్య నిపుణులు, యోగా గురువులు అందుబాటులో ఉంటారన్నారు. జీవ నశైలిలో మార్పులకు ప్రాచీనమైన ఆయుర్వేద విధానానికి అలవాటుపడుతున్న తరుణంలో ప్రత్యేకమైన సౌలభ్యం లలిత్‌గ్రూప్ సమకూరుస్తోందన్నారు.

కావేరినగర్‌లో కన్నడ రాజ్యోత్సవం



కళాబృందాల నడుమ ఊరేగింపు

మహదేవపుర, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కావేరినగర్‌లోని డాక్టర్ రాజ్‌కుమార్ క్రీడామైదానంలో ఉత్తర కర్ణాటక క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొని మాట్లాడుతూ 'కన్నడవే సత్య కన్నడవే నిత్య' అనే నినాదాలతో కన్నడ రాజ్యోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. నవంబరు నెలంతా ఉత్తర కర్ణాటక నుంచి దక్షిణ కర్ణాటక వరకు కన్నడ రాజ్యోత్సవం సాగుతోందన్నారు. కావేరినగర్ నుంచి వైట్‌ఫీల్డ్ మెయిన్‌రోడ్డు మీదుగా కన్నడమాత భువనేశ్వరి రథాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రూరల్ బీజేపీ అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, ఉత్తర కర్ణాటక యువజన క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు అనిల్, ప్రముఖులు పంచాక్షరి, పవన్‌శెట్టి, అభిషేక్, కావేరినగర్ రవి, అంబరీశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



ఎన్‌సీసీ కేడెట్‌ల బృందం

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని 8వ కర్ణాటక బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్‌లో శిక్షణలు ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 500మంది విద్యార్థులకు ఈనెల 18 నుంచి 27వరకు శిక్షణలు ఇచ్చారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అంశాలపై క్యాంప్ కమాండెంట్ కల్నల్ పంకజ్‌సిన్హా నేతృత్వంలో శిబిరం సాగింది. పరేడ్, డ్రిల్, ఆయుధ శిక్షణ, ఫైర్ ఫైటింగ్, వాచ్ అండ్ వార్డ్ వంటి అంశాలలపై శిక్షణలు ఇచ్చారు. ఇండియన్ బ్యాంకు మాజీ ఫ్యాకల్టీ కేఎల్ రావ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సంతానం కలగలేదని వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన దొడ్డయ్య(39) అనే వ్యక్తి పిల్లలు కలగలేదని జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దొడ్డయ్యకు వివాహమై 14 ఏళ్లయింది. ఇంతవరకు సంతనం కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం ఇంటి అవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి భార్య లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.